తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి



జలమండలి మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ప్రశాంత్

బండ్లగూడ: వేసవిలో ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 10వ డివిజన్ కార్పొరేటర్ ప్రశాంత్ నాయక్ కోరారు. ఈ మేరకు గురువారం జలమండలి మేనేజర్ శ్రీనివాసులును కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు వేసవిలో ఎదుర్కొంటున్న నీటి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యను పరిష్కరించేందుకు జలమండలి మేనేజర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చామన్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

నీటి ట్యాంకర్ల వ్యాపారంపై ఫిర్యాదు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఇష్టారాజ్యంగా కొనసాగుతున్న నీటి వ్యాపారాన్ని అరికట్టాలని మాజీ వార్డు సభ్యుడు ప్రవీణ్‌కుమార్ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు అందజేశామని, మున్సిపాలిటీ పరిధిలో వాగుల పక్కన బోర్లువేసి ఇష్టానుసారంగా రూ. 900ల నుంచి రూ.2 వేల వరకు ట్యాంకర్ల నీటిని అమ్ముకుంటున్నారని ఆరోపించారు..

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

మణికొండ: మున్సిపాలిటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌ను వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ కౌన్సిలర్లు, నాయకులు కలిశారు. ఈ సందర్భంగా గురువారం ఆయనను మున్సిపల్ కార్యాలయంలో కలిసి కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నందుకు సన్మానించి పలు కాలనీల్లో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బీరప్ప, కౌన్సిలర్లు శ్రీకాంత్‌స్వామి, వందననగేష్, కో–ఆప్షన్ సభ్యులు సిద్దప్ప, లక్ష్మీ రాములు, నాయకులు శంకర్‌సింగ్, వేణుకుమార్, నరసయ్యచారి, శ్రీనివాస్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, అనితాదేవి, రాజేష్, ఆనందర్ రావు, శివ తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల ప్రదానం

రాజేంద్రనగర్: జేఎన్‌టీయూ హైదరాబాద్ యూనివర్సిటీ, ట్రిపుల్ ఆర్‌ఆర్‌ఆర్ సంస్థ నిర్వహించిన కాంక్లేవ్ అవార్డుల ప్రదానం జరిగింది. యూనివర్సిటీ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల బోధన అధ్యాపకుల విభాగంలో షాదన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాల ఈసీఈ డిపార్ట్‌మెంట్ నుంచి ఉత్తమ ఫ్యాకల్టీగా ప్రొఫెసర్స్ ఆఫ్ ఈసీ డిపార్ట్‌మెంట్ డాక్టర్ రవీందర్ కోరని, డాక్టర్ వెంకటరమణారెడ్డి, ప్రొఫెసర్ పీ.వై.రమేష్, ప్రొఫెసర్ శేషగిరి, ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎం ప్రసాద్‌లు ఉన్నారు. ఈ అవార్డుల ప్రదానోత్సవం జేఎన్‌టీయూ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ కట్టా నరసింహారెడ్డి, రాచకొండ సీపీ మహేశ్ భగవత్, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, డైరెక్టర్ రజనీ నుంచి అందుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మణికొండ: ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట్ కౌన్సిలర్ జి.శివారెడ్డి అన్నారు. గురువారం కోకాపేట గ్రామానికి చెందిన మంగలి కృష్ణకు మంజూరైన రూ. 52 వేల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును లబ్ధిదారుడికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కష్టాలలో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ మున్సిపల్ ఉపాధ్యక్షుడు ఆర్. విశ్వనాథ్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల రిమాండ్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

అత్తాపూర్: పాతకక్షలతో ఓ యువకుడిని దారుణంగా హత్య చేసిన కేసులో అత్తాపూర్ పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ఐదు సెల్‌ఫోన్లు, ఒక కత్తి, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు. రాజేంద్రనగర్‌లోని డీసీపీ కార్యాలయంలో డీసీపీ సీహెచ్. శ్రీనివాస్ రాజేంద్రనగర్ ఎస్ఓటీ డీసీపీ బాల, రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ రమణా రెడ్డిలతో కలిసి నిందితుల వివరాలను వెల్లడించారు. వివరాల ప్రకారం... కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన పెయింటర్ మహ్మద్ ఫయాం (22)కు తోటి స్నేహితులతో గతంలో గొడవలు ఉన్నాయి. స్నేహితుల్లో ఒకరైన యాసిన్ నేహాఖాన్ అనే అమ్మాయి పేరుతో నకిలీ ఇన్‌స్టాగామ్ అకౌంట్‌ను ఓపెన్ చేసి ఫయాంతో గత కొద్ది రోజులుగా చాటింగ్ చేస్తున్నాడు. దీనిలో భాగంగా ఈనెల 5న రాత్రి 7.45 గంటలకు ఫయాంను చాటింగ్‌లో యాసిన్ చింతల్‌మేట్‌కు రావాలని సూచించాడు. చెప్పినట్టుగానే ఫయాం చింతల్‌మేట్ ప్రాంతానికి చేరుకున్నాడు. అప్పటికే పతకం వేసిన యాసిన్‌తో పాటు ఉబారి ఖురేషి (18), మహ్మద్ అబ్దుల్ మిన్హాజ్ (20), మహ్మద్ ఖయ్యుం (19), మహ్మద్ రహీం (23) ఫయాంతో మరోసారి గొడవకు దిగి తమ వెంట తెచ్చుకున్న కత్తులు, చాకులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. అనంతరం ఫయాం మృతి చెందాడని నిర్ధారించుకుని పరారయ్యారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్‌లో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని వెంటనే తగిన చర్యలు తీసుకుని పరిష్కరించాలని కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేషగౌడ్ కోరారు. విద్యుత్‌శాఖ ఏడీఈ సత్యనారాయణను గురువారం కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్రీసాయి కాలనీ, వివేకానంద కాలనీ, ఓంనగర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, వీరబ్రహ్మేంద్రస్వామి కాలనీ, కృష్ణానగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఓల్టేజీ హెచ్చుతగ్గులతో ఇళ్లల్లోని ఎలక్ట్రికల్ పరికరాలు కాలిపోతున్నాయన్నారు. దీనివల్ల కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, గత కొంత కాలం క్రితం కార్పొరేషన్ నుంచి కొన్ని పోల్స్ వేశామన్నారు. వాటికి త్రీఫేస్ కరెంటు వైరింగ్ అమర్చలేదని వెంటనే ఈ సమస్యను కూడా పరిష్కరించాలన్నారు. ఈ విషయాలను ఏడీఈకి వివరించామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని త్వరలోనే సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రాజేంద్రనగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ పిల్లర్ నంబర్ 150 పక్కన ఈనెల 6న ఉదయం 11 గంటల సమయంలో 45–50 ఏళ్లున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివరాత్రికి ఆలయాల ముస్తాబు

- దేవాలయాల ఆవరణలో చలువ పందిళ్లు
- తెల్లవారు జాము నుంచే అభిషేకాలు



శివరాత్రి పూజలకు ముస్తాబైన పుప్పాల్‌గూడ కాశీవిశ్వేశ్వరాలయం

మణికొండ: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలకు గండిపేట మండల పరిధిలోని శైవ క్షేత్రాలు సిద్ధమయ్యాయి. దేవాలయాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయాల కమిటీలు, అర్చకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మణికొండ శ్రీపార్వతీరామలింగేశ్వరాలయం, పుప్పాల్‌గూడ కాశీవిశ్వేశ్వరాలయం, నార్సింగి మున్సిపాలిటీ మంచిరేవులలోని మచిలేశ్వరాలయాలు ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. ఆయా దేవాలయాల వద్ద రంగురంగుల దీపాలు, చాయా చిత్రాల కటౌట్‌లు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తులకు అనుగుణంగా క్యూలైన్లను ఏర్పాటు చేశామని ఆలయ పూజారులు, ధర్మకర్తలు, పాలక కమిటీలు తెలిపాయి.

ప్రత్యేక పూజలివే...

మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని ఆయా శివాలయాల్లో ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అభిషేకాలు నిర్విరామంగా కొనసాగుతాయని అర్చకులు తెలిపారు. అనంతరం పుప్పాల్‌గూడ, మంచిరేవులలో కేవలం దర్శనాలు మాత్రమే కొనసాగనున్నాయి. మణికొండలో సాయంత్రం 4గంటల నుంచి దర్శనాలు, సాయంత్రం 7గంటలకు స్వామివారి పల్లకీసేవ, రాత్రి 9గంటలకు కల్యాణం, రాత్రి 12 గంటలకు ఆయా దేవాలయాలల్లో లింగోద్భవ కాల మహాన్యాసకపూర్వ రుద్రాభిషేకాలు కొనసాగుతాయని అర్చకులు తెలిపారు. మంచిరేవులలో మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలను ఈనెల 11 వరకు నిర్వహిస్తున్నారు. తొలిరోజు ఉదయం ధ్వజారోహణ, గణపతిపూజ, రుద్రాభిషేకం అనంతరం దర్శనాలు ఉంటాయని వంశపారంపర్య ధర్మకర్తలు తెలిపారు. రాత్రి 9.05 గంటలకు పార్వతీపరమేశ్వరుల కల్యాణం, లింగోద్భవకాలం అర్ధరాత్రి రుద్రాభిషేకం, జాగరణలు ఉంటాయని, భక్తులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయా దేవాలయాల అర్చకులు కోరారు.



మంచిరేవుల మచిలేశ్వరస్వామి

ఎంపీ రంజిత్‌రెడ్డికి సత్కారం



ఎంపీ రంజిత్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు గడ్డం రంజిత్‌రెడ్డి ఉప్పర్‌పల్లి, బుద్వేల్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున రూ.20 లక్షలను ఎంపీ నిధులను మంజూరు చేసినందుకు గురువారం బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేష్, జాగృతి నాయకులు రగడంపల్లి శ్రావణ్‌కుమార్‌తో కలిసి బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కో–ఆప్షన్ సభ్యులు మలాకి రత్నం, శ్రీనివాస్, పంబాల రాజు, చిన్న తదితరులు ఆయనను కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఆస్తిపన్నును సకాలంలో చెల్లించాలి



ఆస్తిపన్నును స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఆస్తి పన్నును సకాలంలో చెల్లించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. గురువారం గంధంగూడ విఘ్నేశ్వర కాలనీలో ఆయన ఇంటింటికి తిరిగి ఆస్తిపన్ను వసూలుపై ప్రజలకు అవగాహన కల్పించారు. పద్మశ్రీహిల్స్, ఓంనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రజల నుంచి ఆస్తిపన్నును స్వీకరించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. 7వ డివిజన్‌లో డ్రైనేజీ, రోడ్ల సమస్యలను పర్యవేక్షించారు. అనంతరం 8వ డివిజన్‌లో శివాలయం వద్ద స్వీపింగ్ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో 100 శాతం ఆస్తిపన్ను వసూలు చేసేందుకు అధికారులు, సిబ్బంది అహర్నిశలు కష్టపడి పని చేస్తున్నారన్నారు. ప్రజలు తమ ఆస్తిపన్నులను ఎప్పటికప్పుడు చెల్లించాలని, అప్పుడే తమ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పారిశుద్ధ్య జవాన్లకు ఆదేశించారు. కాలనీ ప్రెసిడెంట్ జయప్రకాష్, కాలనీవాసులు, డీఈఈ యాదయ్య, ఏఈఈ రాజ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

పార్కులను పరిరక్షించండి !

మణికొండ: లే అవుట్‌లో చూపిన పార్కులను ఒక్కొక్కటి అన్యాక్రాంతం చేయటంతో పాటు వాటిని అభివృద్ధి చేయకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు వారికి సహకారం అందిస్తున్నారని, వెంటనే వాటిని పరిరక్షించి ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని మణికొండ మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ పద్మారావు, వేంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉపేంద్రనాథ్‌రెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకను కోరారు. గురువారం కలెక్టరేట్‌కు పార్కులు, ఆక్రమణకు గురైన భూములు వివరాలను వివరించారు. కాలనీలో కమ్యూనిటీహాల్ లేక ప్రజావసరాలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని, తాగునీటి పైప్‌లైన్లను ఏర్పాటు చేయాలని, అవసరమైన మేరకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లను అభివృద్ధి చేయాలని కోరామన్నారు. దీంతో ఆయన వెంటనే స్పందించి పార్కులు, ప్రభుత్వ భూమి ఆక్రమణలను సహించే ప్రసక్తే లేదని, వెంటనే వాటిని పరిరక్షిస్తామని హామీ ఇచ్చారన్నారు.



ఓటుహక్కుపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: ఓటుతోనే దేశ భవిత యువత భవిష్యత్తు ఆధారపడి ఉందని ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియెగించుకోవాలని ఉద్యాన విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ ప్రశాంత్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మన్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో 'మేరా పెహలా ఓట్ దేశ్‌కేలియో' కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, ప్రొఫెసర్లు ర్యాలీ నిర్వహించారు. తొలిసారి ఓటుహక్కు వచ్చిన వారికి ఓటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచంలోనే భారత్ అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని ఓటు అనే ఆయుధంతో సరైన వ్యక్తిని పాలకుడిగా వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారు తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి సంతోషిని, ఏబీఎస్ లావణ్య, నాగహర్షిత, డాక్టర్ శ్రీనివాస్, శ్రీరాములు, వేణుగోపాల్, శ్రీనాథ్, తిరుపతయ్య, రజిత, అశోక్, శ్రీకాంత్, మమత, రామకృష్ణ,విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు సాధికారతను సాధించాలి



ఎంజీఐటీలో జరిగిన మహిళా దినోత్సవంలో న్యాయమూర్తి తదితరులు

కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ సుమలత

మణికొండ: మహిళలు తమ లక్ష్యం, విద్యకు విలువను ఇవ్వడం ద్వారా అన్ని రంగాల్లో సాధికారత సాధించాలని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్ సుమలత అన్నారు. గండిపేట్‌లోని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో గురువారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తల్లితండ్రులు బాలికల పట్ల తేడాలను చూయించడం లేదని, వారిని ప్రతి మహిళ గౌరవించాలన్నారు. తమ శక్తిని వినియోగించుకుని ఒకరికొకరు సాధికారత సాధించాలన్నారు. క్లినికల్ సైకలాజిస్ట్ వృశాలిరెడ్డి, కళాశాల కోశాధికారి సంధ్యశ్రీ, క్లాసికల్ డ్యాన్సర్ యామినిరెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, ఉమెన్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో వారం రోజులుగా మహిళలకు నిర్వహించిన పలు పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు.

మణికొండలో...

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని కాకతీయ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిలర్లు శైలజ వినోద్, మీన ముత్యాలు, ఎల్. వందననగేష్ పాల్గొన్నారు.

బఫర్ జోన్‌లో కూల్చివేతలు



మణికొండ: చెరువును ఆనుకుని ఉన్న బఫర్‌జోన్‌లో నిర్మిస్తున్న విల్లాలను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. గండిపేట మండలం, మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 44లో 96 ఎకరాల్లో ఇబ్రహింబాగ్ చెరువు ఉంది. చెరువు పక్కనే కొందరు భూమికొని కమిటీగా ఏర్పడి విల్లాలను దశాబ్దకాలంగా నిర్మించుకుంటున్నారు. వాటిల్లో కొన్ని చెరువు బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేస్తుండటంతో వాటిని గురువారం ఉదయం ఇరు శాఖల అధికారులు సంయుక్తగా కూల్చివేశారు. ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకుంటున్న రెండు విల్లాలు, పిల్లర్‌ల దశలో ఉన్న మరో మూడు విల్లాలను కూల్చివేశారు.

బాక్స్ డ్రైన్ పనుల పరిశీలన

మణికొండ: గత రెండు నెలలుగా కొనసాగుతున్న బాక్స్‌డ్రైన్ పనులు మరో పది రోజుల్లో పూర్తవుతాయని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని ట్రయల్స్ విల్లాల ఎదుట కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నెల రోజుల్లో పూర్తి కావాల్సిన పనులు భూమిలో రాళ్లు రావడంతో వాటిని తొలగించేందుకు ఎక్కువ రోజులు పట్టిందన్నారు. ఇప్పటికే రోడ్డులో బాక్స్‌డ్రైన్ పైకప్పు పనులు, ఎత్తుగా పెరిగిన బాక్స్‌డ్రైన్ లెవల్‌లో మట్టి పోయటం పనులు పూర్తయ్యాయన్నారు. మరో పది రోజుల్లో మిగిలిన రోడ్డు పనులను పూర్తి చేస్తామని అధికారులు, కాంట్రాక్టర్ తెలిపారన్నారు. పంచవటీ కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రామారావు పాల్గొన్నారు.